# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు**

2. **రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

3. **ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' కింద కిట్ అందించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

4. **విజయవాడలో రేపటి నుంచి 35 వ పుస్తక మహోత్సవం ప్రారంభంకానుంది.**

5. **రాష్ట్రం లో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది.**

==========================

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని కేంద్రమంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరంఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రయాగ్ రాజ్ లో ప్రారంభం కానున్న కుంభమేళాకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి 45 కోట్ల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని కేంద్రమంత్రి తెలుపుతూ,

వాయిస్ (30 సెకన్లు)

--------------------------

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆంగ్ల సంవత్సరం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ గ్రామంలో నాయకులు, కార్యకర్తలకు ఆయన ఈ రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. యువత ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా ఉండేందుకు పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహకాలను ఇస్తున్నామని కేంద్రమంత్రి వివరించారు.

--------------------------

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, రాష్ట్ర గురుకుల విద్యాసంస్థలు, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' కింద కిట్ అందించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, ప్రాక్టికల్ మాన్యువల్స్, నోట్ పుస్తకాలు, ప్రాక్టికల్ రికార్డులను 2025-26 విద్యా సంవత్సరానికి అందించనున్నారు. దీనికి 32.95 కోట్ల రూపాయలు వ్యయం కానున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

----------------------------

ఆంధ్రప్రదేశ్ దక్షణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ -ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో 2025-26కు సంబంధించి సమర్పించిన విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు విజయవాడలో, 10న కర్నూలులోని రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి కార్యాలయంలో ఈ ప్రక్రియను చేపడతామన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4:30 వరకు వినియోగదారులు తమ సమీపంలోని విద్యుత్తు సర్కిల్ కార్యాలయాల నుంచి దృశ్యమాధ్యమం ద్వారా కూడా అభ్యంతరాలు తెలియజేసేందుకు అవకాశం కల్పించామన్నారు.

----------------------------

ప్రయాణికుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు తెలిపారు. విజయవాడలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ లు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా, ఈ ఏడాది మార్చి నుంచి కొత్త నియమాల ప్రకారం ట్రాఫిక్ నిభందనలు పాటించని వారికి జరిమానా విధిస్తామని వెల్లడించారు.

వాయిస్ ( 30 సెకన్లు)

----------------------------

విజయవాడలో రేపటి నుంచి 35 వ పుస్తక మహోత్సవం ప్రారంభంకానుంది. నగరంలోని ఇందిరాగాంధీ మైదానంలో జనవరి 12 వ తేదీ వరకు 11 రోజుల పాటు జరిగే ఈ పుస్తక మహోత్సవంలో రెండు వందలకు పైగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. రేపు సాయంత్రం ఉప ముఖ్య మంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈనెల 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు పుస్తక ప్రియుల పాదయాత్ర సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణం వరకు జరుగుతుంది. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు పుస్తక ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

----------------------------

రాష్ట్రంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు సురేష్‌కుమార్, సాల్మన్ ఆరోక్యరాజ్‌లకు పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2000 బ్యాచ్‌కి చెందిన ఈ ఇద్దరు అధికారులకు ముఖ్య కార్యదర్శి హోదా కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2009 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు కార్తికేయ మిశ్రా, వీరపాండ్యన్, సీహెచ్ శ్రీధర్‌లకు కార్యదర్శి హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయంలో లో సహాయ కార్యదర్శిగా ఉన్న కార్తికేయ మిశ్రాకు అక్కడే సీఎంవో కార్యదర్శిగా పదోన్నతి కల్పించారు. వీరపాండ్యన్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవోగా కొనసాగనున్నారు. వైయస్సార్ జిల్లా

కలెక్టర్‌గానే శ్రీధర్‌ను కొనసాగిస్తూ, ఐపీఎస్ అధికారులు విక్రాంత్ పాటిల్, సిద్ధార్థ్ కౌశల్‌కు పదోన్నతి కల్పిస్తూప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది

---------------------------

ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఆర్టీసీ బస్ డిపోలో రెండు నూతన బస్సు సర్వీసులను గత సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తున్న ఇతర రాష్ట్రాల్లో పరిశీలించి, విధి విధానాలను రుపొందిస్తున్నామని చెప్పారు

వాయిస్ ( 30 సెకన్లు)

---------------------------

ప్రజల భద్రత కోసం పోలీస్ వ్యవస్థ నిరంతరం సేవలు అందిస్తోందని బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ దూడి అన్నారు. బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా వార్షిక నేర నివేదికను ఆయన నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా తుషార్ దూడి మాట్లాడుతూ 2024లో బాపట్ల జిల్లాలో నేరాల సంఖ్య తగ్గిందని, చోరీ సొత్తు రికవరీ శాతం పెరిగిందని తెలిపారు. అయితే ఈ ఏడాది సైబర్ నేరాలు బాగా పెరిగాయని వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తుపదార్థాల వినియోగాన్ని నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వివరించారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం వైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహిస్తోందని చిత్తూరు జిల్లా సైన్స్ ఫెయిర్ నోడల్ అధికారి బి. అరుణ్ కుమార్ తెలిపారు. చిత్తూరులో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో 31 మండలాలు నుండి వచ్చిన మొత్తం 84 ప్రదర్శనల్లో ఆరు ప్రదర్శనలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థుల వైజ్ఞానిక ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 17 సెకన్లు....

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని జమ్ముకశ్మీర్ గవర్నర్ సిహెచ్ మనోజ్ సిన్హా, తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కలు ఈరోజు వేర్వేరుగా దర్శించుకున్నారు. దర్శన అనంతరం ప్రముఖులకు రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.

---------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. డిసెంబర్ 7 నుంచి మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే ఈ వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వంద రోజుల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించడం, సత్వర వైద్య సేవలను అందించడం, నిక్షయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల కింద పౌష్టికాహారం అందించడం వంటివి నిర్వహిస్తారు.

======================